ప్రజాశక్తి
మంగళవారం 23 జులై 2024

జెసి అభిషేక్ గౌడ్ బాధ్యతల స్వీకరణ

జెసి అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది వరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో అదనపు సంచాలకులుగా పని చేశానన్నారు. గతంలో అస్సాంలో కొంతకాలం గిరిజన ప్రాంతంలో పని చేసిన అనుభవం ఉన్నందున ఈ ప్రాంత గిరిజనుల అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో చింతూరు డివిజన్ లో వరద ప్రభావం ఉన్నందున నిత్యావసర, అడ్వాన్స్డ్ రేషన్, తదితర వాటిపై శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. రేషన్ కార్డుల జారీలో సమస్యలు అధిగమించి అర్హులైన వారికి కార్డుల జారీకి కృషి చేస్తానని పేర్కొన్నారు.

జలదిగ్బంధంలో విలీన మండలాలు

- భద్రాచలం వద్ద క్షణక్షణానికీ పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- పునరావాస కేంద్రాలకు తరలివెళ్తున్న ప్రజలు
- కొండలు, గుట్టలపై పాకలు నిర్మాణం
- అంతంత మాత్రంగానే సహాయక చర్యలు
- ఉధృతి తగ్గని వాగులు, వంకలు

వడ్డిగూడెం నుండి పడవలో సురక్షిత ప్రాంతానికి వస్తున్న బాధితులు

ప్రజాశక్తి- చింతూరు

భారీ వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి పెరగడంతో చింతూరు ఏజెన్సీ డివిజన్ పరిధిలోని పోలవరం నాలుగు విలీన మండలాల్లోని పలు గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం ఉదయం ఐదు గంటలకు 46.46 అడుగులు ఉండగా సాయంత్రం 4 గంటలకు 48.2 అడుగులకు చేరుకొని రెండవ ప్రమాదిక హెచ్చరికను చేరింది. మరో వైపు చింతూరు వద్ద శబరి నీటిమట్టం 40.42 మీటర్లకు పెరిగింది. భారీ భారీ వర్షాలు కారణంగా సీలేరు, శబరి నదులతో పాటుగా కొండావాగుల ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో చింతూరు మండలంలో సుమారు 60 గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలోనే ఉన్నారు. దీంతో మండలంలో 20 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 121 కుటుంబాలకు సంబంధించిన వస్తు సామాగ్రిని తరలించారు. ఇప్పటికే శబరి ఒడ్డు ముంపు ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ప్రభుత్వం తరపున ఇంతవరకు చింతూరు మండలానికి ఎటువంటి ఆహార పదార్థాలు, బరకాలుగాని పంపిణీ చేయలేదని పలువురు నిర్వాసితులు తెలిపారు. వరదల వల్ల నీరు కలుషితమైన నేపథ్యంలో తాగునీరు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఎటపాక : సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి (48 అడుగులు) దాటి ప్రవహిస్తుంది. గోదావరి వరద మరికొంత పెరగవచ్చని సిడబ్ల్యూసీ అధికారులు స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని వీరాయగూడెం గ్రామానికి, సోమవారం నందిగామ, మురుమూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముందస్తు చర్యగా గొల్లగూడెం ప్రజలను హైస్కూల్లోని పునరావాస కేంద్రానికి తరలించారు. వరద మరింత పెరిగితే గుండాల, రాయనపేట, వెంకటరెడ్డిపేట, నెల్లిపాక గ్రామాలకు రాకపోకలను నిలిచిపోతాయి.

విఆర్.పురం : మండలంలోని శబరి, గోదావరి, ఉప్పొంగటంతో తుమ్మిలేరు పంచాయతీ కొల్లూరు, గొందూరు, తుమ్మిలేరు, కొండెపూడి, శ్రీరామగిరి పంచాయతీ చొక్కానపల్లి, కల్తునూరు, శ్రీరామగిరి గ్రామాల ప్రజలు కొండలపైనా, రామవరం పంచాయతీ రామవరం, చొప్పల్లి, రామవరంపాడు, అడి వెంకన్నగూడెం, చిన్న మట్టపల్లి పంచాయతీ చింత రేగుపల్లి, కన్నాయి గూడెం గ్రామాలు అడవిలోనూ పాకలు వేసుకుంటున్నారు. వడ్డుగూడెం పంచాయతీ వడ్డుగూడెం, వడ్డుగూడెం కాలనీ, ధర్మతాల గూడెం గ్రామాల ప్రజలు రేఖపల్లి తహశీల్దారు కార్యాలయం ముందు చుట్టుపక్కల పాకలు వేసుకుంటున్నారు. తమకు నేటికీ ప్రభుత్వం నిత్యావసర సరుకులు, బరకాలు, కిరోసిన్, సోలార్ లైట్లు ఇవ్వలేదని ప్రజలు తెలిపారు.

కూనవరం : గోదావరి వరద ఉధృతి కారణంగా కూనవరం టేకులబోరు, టేకుబాక, కొండ్రాజు పేట, శబరికొత్తగూడెం గ్రామాలకు వరద నీరు చేరింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఎవరికీ వారు సొంతగా ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకొని తరలివెళ్తున్నారు. గొమ్ము అయ్యవారిగూడెం, పెద్దర్కూర్‌తో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పూర్తిగా మునిగిన గండిపోచమ్మ ఆలయం

దేవీపట్నం : ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలోని గండి పోచమ్మ అమ్మవారి ఆలయం పూర్తిగా నీట మునిగింది. గోదావరి వరద ఉధృతి తగ్గిన తరువాతే అమ్మవారి అమ్మవారి ఆలయంలో భక్తులకు దర్శనాలు కలగనున్నాయి.

అడవిలో కర్రలతో పాక వేసుకుంటున్న గిరిజనులు

పడవలో బరకాలను తెప్పిస్తున్న విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

ముంపు బాధితులను అన్ని విధాల ఆదుకోవాలి

- సిపిఎం నేతలు బొప్పెన కిరణ్, లోతా రామారావు
- వరద ప్రాంతాలను సందర్శించిన సిపిఎం బృందం

చింతూరు : వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు, గోదావరి వరదకు ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలను అన్ని విధాలా అదుకోవాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు డిమాండ్ చేశారు. చింతూరు డివిజన్‌లోని కొమ్మూరు గ్రామాన్ని కిరణ్ నేతృత్వంలో సిపిఎం బృందం సోమవారం సందర్శించింది. సిపిఎం నాయకులు ప్రమాదకర వాగులను దాటుకుంటూ కుమ్మురు గ్రామనికి చేరుకొని వరద బాధితులను పరామర్శించారు. కిరణ్, రామారావు మాట్లాడుతూ వరద బాధితులకు నిత్యావసర సరుకులు, కిరోసిన్, దోమతెరలు, తాగునీరు అందించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, సీసం సురేష్, నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు నాగిరెడ్డి, చందరావు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీ చొప్పల్లి, రామవరం పాడు, అడవి వెంకన్నగూడెం గ్రామాల్లో సోమవారం ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు పరిశీలించారు. అడవిలో పాకలు వేసుకున్న వారికి ఎంపీపీ బరకాలు అందించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కారం సుందరయ్య, సుధీర్ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని పెద్ద ఆర్కుర్ పంచాయతీ పెద్ద ఆర్కుర్, రేపాక, భగవాన్ పురం కింది గుంపు గ్రామాలను పెద్ద ఆర్కూర్ సర్పంచ్ నాగమణి, సిపిఎం నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అమ్మాజీ, పాయం సత్యనారాయణ, రవితేజ పాల్గొన్నారు.

వరద బాధితుల సమస్యలపై కలెక్టర్‌కు సిపిఎం వినతి

వ్రిఆర్.పురం : మండలంలోని రేఖపల్లికి సోమవారం విచ్చేసిన అల్లూరి జిల్లా కలెక్టర్‌ను కలిసి సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి వరద బాధితుల సమస్యలపై తెలుపుతూ వినతిపత్రం సమర్పించారు. చొక్కనపల్లి ఎస్‌టి కోయ గుంపుకి, కన్నాయిగూడెం గ్రామాలకు బోట్లు ఏర్పాటు చేయాలని, అందరికీ నిత్యావసరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, రవివర్మ ఉన్నారు.

కూనవరం : కూనవరం జనసేన సర్పంచ్ మల్లంపల్లి హేమంత్ గాంధీ అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో కూనవరం వైస్ ఎంపీపీ బండారు సాంబ శివరావు, జనసేన, టిడిపి నాయకులు దాసరి నరేంద్ర, గడ్డిపాటి ప్రసాద్, యడవల్లి బాష్కర్, ఏచు రాము తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో ఐటిడిఎ పిఒలు సూరజ్ గనోరే, చైతన్య

వరద బాధితులకు అండగా నిలవండి

అధికారులకు జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ ఆదేశం

ముంపు బాధితులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి

ప్రజాశక్తి-చింతూరు : వరదలతో బాధపడుతున్న ప్రజలకు అధికారులు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. జిల్లా అధికారులతో వరద సహాయక చర్యలపై సోమవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున ముంపునకు గురవతున్న గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కంట్రోల్ కమాండింగ్ రూమ్‌కు అన్ని రకాల సమాచారం అందించాలన్నారు. నిధుల కొరత లేదని అన్ని ఏర్పాట్లు వేయాలని చెప్పారు. 13 వేల టార్పాలిన్లు పంపిణీ వేస్తున్నామన్నారు. పప్పులు, బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. 45 బోట్లు సేకరిస్తున్నామని, అవసరమైన చోటుకు వెంటనే పంపించాలని చెప్పారు. పునరావాస కేంద్రాలకు వచ్చేవారు వంట పాత్రలు తెచ్చుకోక పోతే సరఫరా చేయాలని, పిల్లలకు పాలు పంపిణీ చేయాలని, పునరావాస కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కూనవరం నోడల్ అధికారి సూరజ్ గనోరే, విఆర్.పురం నోడల్ అధికారి ప్రశాంత్, తహశీల్దారులు, ఎంపిడిఓలు, పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

వరద సహాయ సహకారాలు వరద బాధితులకు సకాలంలో అందించేందుకు చింతూరు ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమును కలెక్టర్ పరిశీలించారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం చింతూరు శబరి నది ఒడ్డున ఉన్న నివాసాలకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. నిమ్మలగూడెం దగ్గర మధ్యప్రదేశ్ వెళ్లే రహదారిపైకి వరద నీరు రావడం పరిశీలించి ఆ రహదారిపై రాకపోకలు నిషేదించాలని ఆదేశించారు. చట్టి సమీపంలోని భద్రాచలం వెళ్లే రహదారి రోడ్డుపైకి వరద నీరు ప్రవాహన్ని పరిశీలించి ఆ రహదారిపై కూడా వాహనాలు రాకపోకలు బందు చేయాలని, ఇరువైపులా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీఆర్జేసీ కాలేజీలో వరద బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. కూనవరం మండలం చిన్నఆర్యూరు బస్టాండ్ దగ్గర వరద బాధితులు తాత్కాలికంగా కట్టుకున్న గూడులను కలెక్టర్ సందర్శించారు. కూనవరం, విఆర్ పురం మండలాలలో రంపచోడవరం ఐటీడీఏ పిఒ సూరజ్ గనోరే, చింతూరు ఐటిడిఏ పిఒ కావూరు చైతన్య ట్రాక్టర్‌పై వెళ్లి వరద బాధితులతో మాట్లాడారు.

ఐఎఎస్ అధికారులు, ఉప కలెక్టర్లకు ప్రత్యేక విధులు

కూనవరం : చింతూరు డివిజన్లోని వరద సహాయ సహకారాలు సకాలంలో అందించే విధంగా నాలుగు మండలాలకు పాడేరు జిల్లా జెసి, ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్ తదితర నలుగురు ఐఎఎస్ అధికారులను, నలుగురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కూనవరం మండల తహశీల్దారు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో వరద సహాయక చర్యలపై, కంట్రోల్ రూమ్ విధుల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, డిఎంహెచ్‌ఓ జమాల్‌బాషా, డిపిఓ కొండలరావు. డిఎల్‌పిఓ రఘునందన్, ఏపీఈపీడీసీఎల్ అధికారులు టిఎస్ఎన్ మూర్తి, ఎండి యూసఫ్, తహశీల్దార్లు మురళీకష్ణ, నజీముల్లా, చలపతిరావు, రవిబాబు ఎంపీడీవో ఎ.లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళను పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్

గుర్ర గరువులో జ్వరాలు

- వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామస్తుల అభ్యర్థన

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు మండలం మోదపల్లి పంచాయతీ గుర్రగరువు గ్రామంలో ఇంటింటా జ్వరాలు ప్రబలడంతో గిరిజనులు అస్వస్థతకు గురైనట్లు పంచాయతీ మాజీ సర్పంచ్ పాలికి లక్కు సోమవారం ప్రకటనలో తెలిపారు. వాతావరణం మారి మంచినీటి కలుషితం కావడంతో గ్రామంలో ఉన్న చిన్నపిల్లలతో సహా మహిళలు, పురుషులకు టైఫాయిడ్ జ్వరాలు ప్రబలి మంచాన పడ్డారని పేర్కొన్నారు. గ్రామంలో పాలికి కొమిలి, కిలో మనీ, ఇంద్రజ, కుర్ర వరుణ్, కుర్ర నితిన్, పాంగి యువరాజ్, మర్రి నానాజీ, పాలికి వాసు, మర్రి రామారావు, మర్రి రాములమ్మ, మర్రి సంజీవరావు, కుర్ర మురళి హాసన్, కృష్ణ, హాసిని, పాలికి రాజులమ్మలు ఇలా చాలామంది టైఫాయిడ్ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని కోరారు.గ్రామంలో క్లోరినేషన్ చేసి జ్వర బాధితులకు వైద్య సదుపాయం కల్పించాలని కోరారు.

రోడ్డుపై భారీ గొయి

భారీ గోతిలో నుంచి వెళుతున్న .జీపు

ప్రయాణం..ప్రమాదభరితం...

-అంజలిశనివారం రోడ్డులో భారీగా గోతులు

-భయం భయంగా రాకపోకలు

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు దారుణంగా మారాయి. ఎక్కడ గోతుందో ఎక్కడ రోడ్డు ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చింతపల్లి మండలంలోని అంజలి శనివారం రహదారి దారుణంగా మారింది. అడుగుకో గుంత పడి.. రాళ్ల తేలి అత్యంత ప్రమాదకరంగా మారింది. అంజలి శనివారం గ్రామానికి వెళ్లాలంటనే వాహనదారులు భయ పడుతున్నారు.ఎన్నో మార్లు తమ గ్రామానికి రహదారి నిర్మించాలంటూ ఆ గ్రామస్తులు ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకున్నా ఫలితం లేక పోయింది.ఈ మార్గంలో మట్టి రోడ్డు కాస్త గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్తడిగా మారింది. దీంతో, ప్రయాణం చేయడానికి ప్రమాద కరంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రానికి చేరాలన్నా, వివిధ అవసరాల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాలన్నా శిధిలమైన రహదారిలో ప్రయాణం చేస్తూ గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు.కొన్ని చోట్ల కొంతమేర రహదారి నిర్మాణానికి పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేయడంతో కంకర తేలి ప్రమాదంగా మారింది.గత ఐదేళ్లగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల గుత్తేదారు అక్కడక్కడ నిర్మాణ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో, అత్యవసర పరిస్థితుల్లో ఈ రహదారిపై ప్రయాణం ఎలా అని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపి అంజలి రహదారుల నిర్మాణానికి కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పట్టాలపై కూలిన చెట్టు

కెకె లైన్‌లో విరిగిపడ్డ చెట్టు

-ముమ్మరంగా పునరుద్ధరణ పనులు

- యధావిధిగా రైళ్ల రాకపోకలు

ప్రజాశక్తి -అనంతగిరి:కొత్తవలస -కిరండల్ (కేకే లైన్) మార్గమధ్యలో భారీ వృక్షం విరిగిపడటంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం నెలకొంది. కురుస్తున్న భారీ వర్షాల ఈదురుగాలుల కారణంగా ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో బొర్రా- కరకవలస రైల్వే స్టేషన్ సమీపాన వద్ద రైలు పట్టాలపై భారీ వృక్షం విరిగి పడటంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం నెలకొంది. ఈ ఘటనను గుర్తించిన రైల్వే శాఖ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కొత్తవలస నుండి కిరండోల్ వెళ్ళు రైళ్ల ను బొర్రా స్టేషన్ వద్ద, కిరండోల్ నుండి కొత్తవలస కు వెళ్ళు పల్లు రైళ్లను స్టేషన్ లలో నిలిపివేసి పనులు పునరుద్ధరణకు సర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం నుండి రైళ్ల రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు.

రహదారిని పరిశీలిసున్న సర్పంచ్

వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-చింతపల్లి:వర్షాలు కురుస్తుండటంతో గిరి రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత సూచించారు. సోమవారం పంచాయతీ పరిధిలోని కందులగాది, మల్లవరం, చిన్నగడ్డ గ్రామాల్లో పర్యటించి ఆయా రైతుల వ్యవసాయ పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ, పొలంలో విద్యుత్ స్తంభాల వైర్లు వేలాడున్నట్లయితే అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నగడ్డ గ్రామంలో మునిగిన పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని గిరిజన మత్స్యకారులకు వేటకు వెళ్లవద్దని మండల తహసిల్దార్ రఫీ జాన్ సూచించారు. సోమవారం దారెల, పెద్దగూడ, సుజన కోట పంచాయితీలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎడతెరిపి లేకుండా సుమారు పది రోజుల పైబడి కురుస్తున్న భారీ వర్షాలకు మత్స్యగెడ్డలో అత్యధికంగా నీరు చేరిందని తెలిపారు. గిరిజన మత్స్యకారులు అప్రమత్తంగా ఉండి వేటకు వెళ్లకుండా పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.దారేల సర్పంచ్ పాండురంగ స్వామి మాట్లాడుతూ, మత్స్యకారుల బోట్లు వరదకు కొట్టుకు పోవడంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసిల్దార్ అప్పలస్వామి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్, వీఆర్వో రమేష్, టిడిపి నాయకులు సిహెచ్ గోపాలం , రామకృష్ణ, పాంగి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

నేడు పాఠశాలలకు సెలవు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో ఈనెల 23వ తేదీన జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించామని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ .దినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు సెలవు అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులను తల్లిదండ్రులు బయటకు పంపించకూడదని చెప్పారు. అదేవిధంగా ప్రజలు గెడ్డలు, వాగులు దాటి ప్రయాణించ కూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో ఆధార్ శిబిరాలను ఈనెల 23 నుంచి ఏర్పాటు చేయనున్నామని మండల పరిషత్తు అభివృద్ధి అధికారిణి జయ ఉమ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆధార్ కార్డులో చిన్నారుల చిరునామాతో పాటు సమగ్ర వివరాల నమోదుకు క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బందితో సర్వేను చేపట్టడం జరిగిందని చెప్పారు. పదేళ్లలోపు చిన్నారులతో పాటు ఆపై ఆధార్ సమగ్రంగా ఆన్లైన్ చేసుకోవడానికి వీలు కల్పించామన్నారు. ఇందులో భాగంగా అరమ, గేదల బంధ, అరుకు, గుంటగన్నెలలో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ఆమె చెప్పారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేయించుకోవాలని ఆమె కోరారు.

కిల్కారి మొబైల్ హెల్త్‌పై అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార : కిల్కారి మొబైల్ హెల్త్ సేవలపై డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నోడల్ అధికారులు, ఆశాలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారి సేవలు వాయిస్ కాల్స్ సేవలతో వారి ఆరోగ్య భద్రతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గర్భవతి స్థానిక ఎఎన్ఎం వద్ద వివరాలను నమోదు చేసినప్పుడు ఇచ్చిన మొబైల్ నెంబర్‌కు డాక్టర్ అనిత అనే కల్పిత వైద్యురాలి వాయిస్‌తో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. నాలుగో నెల గర్భం నుంచి పాలిచ్చే తల్లులకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 1 నిమిషం 30 సెకండ్లు నిడివి కలిగిన 72 వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. వాటిలో చెప్పిన సూచనలు పాటించడం ద్వారా గర్భిణులు,బాలింతలు ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు.
ఆర్‌సిహెచ్ పోర్టల్ లో నమోదైన గర్భిణులకు 01244451660 నెంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని, ఒకవేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవిఆర్ సిస్టమ్ నుంచి ఆటోమేటిక్‌గా ఒకేరోజు మూడు ఫోన్‌కాల్స్ వస్తాయన్నారు. ఆ సందేశాన్ని మరలా వినాలంటే 14423 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి వినవచ్చని సూచించారు. ఆశాకార్యకర్తలు మెరుగైన మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్స్‌ను 11 మోడ్యూల్స్ ద్వారా అందించేందుకు రూపకల్పన చేసామని,. 14424 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి కోర్సులోచేరవచ్చని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ రాజు లంకపల్లి, ,జిల్లా ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ ఎస్.జీవన రాణి, డిఐఒ డాక్టర్ బి.ఉమావతి, డిపిఎంఒ కె.ప్రశాంత్, అర్మన్, బిజినెస్ అనలిస్ట్, ఆర్.మోహనరావు, రీజినల్ ప్రోగ్రాం అధికారి, కె.ధర్మేంద్ర, హెచ్ఇఇఒ ఐ.మనోరమ, డిపిహెచ్ఎన్ఒ శశిభూషణ్, డిపిఒ, ఎన్‌హెచ్ఎం మణి కుమారి, డిసిఎం నాగభూషణం పాల్గొన్నారు.

బైక్‌రైడర్‌కు అభినందన

ప్రజాశక్తి- పెందుర్తి : బైక్‌పై 20వేల కిలోమీటర్లు ప్రయాణించి, దేశాన్ని చుట్టుముట్టి వచ్చిన బైక్ రైడర్ షేక్ ఉస్మాన్‌ను జివిఎంసి 94వ వార్డు వేపగుంట మసీదులో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఉస్మాన్ మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 16న బైక్‌రైడ్ ప్రారంభించి మూడు నెలల యాత్రలో లడఖ్ చేరుకుని, అక్కడ జాతీయజెండాను ఎగరేయడం మరపురాని మధురానుభూతి అన్నారు. నేపాల్, చైనా, భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉన్న సుమారు 20 రాష్ట్రాల గుండా ప్రయాణించానని, ఎక్కడికక్కడ బిఎస్ఎఫ్ సెక్యూరిటీ తనకు ఎంతో సహకారం అందించారన్నారు. తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపాడు.

అమరవీరుల యాదిలో..
మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కరాస: విధి నిర్వహణలో భాగంగా చెన్నై నుంచి అండమాన్ వెళుతూ, మార్గమధ్యలో ఎఎన్ 32 విమాన ప్రమాద దుర్ఘటనలో అమరులైన ఎనిమిది మంది ఎన్ఎడిసిఇ కార్మికుల 8వ వర్ధంతిని సోమవారం హస్మి భవనంలో నిర్వహించారు. అమరులైన వారికి తోటి కార్మికులు ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి స్మృతికి మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎఎస్ రాజా బ్లడ్‌బ్లాంక్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదానశిబిరంలో ఎన్‌డిఎ కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన తోటి కార్మికులను గుర్తుకు తెచ్చుకుని రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమ కార్యక్రమంలో ఎన్ఎడిసిఇ యూనియన్ అధ్యక్షుడు నూకరాజు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి- తగరపువలస : విపత్తులు సభవించేటప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సోమవారం గ్రామ సచివాలయం ప్రాంగణంలో స్థానికులకు అవగాహన కల్పించారు. తుఫాను, వరదలు, భూకంపాలు ఏర్పడినప్పుడు ఏమేమి జాగ్రత్తలు తీసుకోవచ్చనేది ప్రయోగాత్మకంగా వివరించారు తహశీల్దార్ టి గోవింద, ఎన్‌డిఆర్ఎఫ్ 10వ బెటాలియన్ టీమ్ కమాండర్ ఈశ్వరరావు, సర్పంచ్ సిరిగిడి సంతోషి, ఈశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ పతివాడ రాంబాబు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

వెంటాడుతున్న వర్షం కష్టాలు

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
చెరువులకు గండ్లు, కొట్టుకుపోయిన వంతెనలు
జనజీవనం అస్తవ్యస్తం.. రాకపోకలకు ఇక్కట్లు

పాడి- రత్నంపేట మధ్య కొట్టుకుపోయిన పైపుల వంతెన

నిత్యవసరాలతో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటి వెళ్తున్న కంపరేగుల గ్రామానికి చెందిన రత్నం

ప్రజాశక్తి- కొయ్యూరు : కొద్ది రోజుల నుంచి ఎడతెగని కురుస్తున్న భారీ వర్షాలు మన్యవాసులకు కష్టాలు వెంటాడు తూనే ఉన్నాయి. సోమవారం ఉదయం కొయ్యూరు మండలం మంప పంచాయతీ పైడి వలసలు గ్రామంలో చెరువుకు గండి పడింది. వాటర్ షెడ్ పథకంలో భాగంగా ఐదేళ్ల నూతనంగా ఈ చెరువును నిర్మించారు. భారీ వర్షాలకు ఈ చెరువుకు గండి పడింది. దీంతో సుమారు 30 ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి లేదు. అధికారులు వెంటనే స్పందించి గండిని పూడ్చాలని కోరుతున్నారు. భారీ వర్షాలకు పాడి- రత్నంపేట మధ్య వంతెన కొట్టుకుపోవడంతో ఐదు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. యు.చీడిపాలెం పంచాయతీలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవాగులను వంగిన చెట్టు పైనుండి దాటుతున్నారు. నడింపాలెం పంచాయతీ కంపరేగులకి వెళ్లే రహదారి మధ్యలో ఉన్న కొండవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. కంపరేగుల గ్రామానికి చెందిన రత్నం అనే మహిళ నిత్యావసర సరుకుల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి అతికష్టం మీద కొండవాగు దాటి శరభన్నపాలెం చేరుకుంది. రహదారి, వంతెన సౌకర్యం లేక ఇలాంటి దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.

వర్షంతో కూలిన చెట్టు

ప్రజాశక్తి - జి.మాడుగుల: మండల కేంద్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జి.మాడుగుల పంచాయతీ సాకిక ప్రధాన రహదారిలో చెట్టు పడి రాకపోకలకు అంతరాయం కలగడంతో విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కె.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఆర్.రవిశాస్త్రి సంఘటన స్థలానికి చేరుకొని చెట్టును తొలగించారు. ట్రాఫిక్ అంతరం లేకుండా చర్యలు చేపట్టారు. అనంతరం జిమాడుగుల పంచాయతీలో బొంజంగి గ్రామము వెళ్లడానికి నిర్మించిన పైపు కల్వర్టు కొట్టుకుపోవడంతో దాని పరిశీలించారు అనంతరం సాకిక గ్రామంలో తుఫాన్ ప్రభావంతో కోట లక్ష్మయ్య, సిగ్గే బాబురావు లకు చెందిన రెండు ఇల్లు వర్షం ప్రభావంతో కూలిపోవడంతో వాటిని సందర్శించడం జరిగిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో వీఆర్వో రవణమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్, వెల్పర్ సాయి.పాల్గొన్నారు.

సాకిక ప్రధాన రహదారిలో కూలిన చెట్టు

కూలిన మెకానిక్ షెడ్లు

కూలిన షెడ్ వద్ద బాధితుడు మునియండి

సీలేరు : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జికె.వీధి మండలం గూడెం కాలనీలో ఆదివారం అర్ధరాత్రి మెకానిక్ మునియండికి చెందిన షెడ్ నేలమట్టమైంది. దీంతో షెడ్లో ఉన్న ఐదు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రభుత్వ అధికారులు పరిశీలించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

వర్షాలతో బోసిపోయిన సంత

ప్రజాశక్తి- పెదబయలు : వర్షాలతో మండల కేంద్రంలో వారపు సంత అస్తవ్యస్తంగా మారింది. ఒడిశా, ఆంధ్ర నుంచి యథావిధిగా కూరగాయలతో వ్యాపారాయులు వాహనాలతో వచ్చారు. కొనేవారు లేక వాహనాల్లోనే కూరగాయలు ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది చిరు వ్యాపారాలు నడిరోడ్డుపై దుకాణాలు పెట్టి వర్షానికి తడుస్తూనే పడిగాపులు కాశారు. సంతలో డ్రైనేజీ లేకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండి పోయింది. దీంతో చేసేది ఏమీ లేక కొంతమంది వ్యాపారాలు తిరుగుముఖం పట్టారు.

కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న పెదబయలు వారపు సంత

మూగజీవాలకు టీకాలు

టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని అతి మారు మూల కుమడ పంచాయితీ బూరుగుమెట్ట, బల్లుగూడ, బాబుసాల పంచాయతీలోని పలు గ్రామాల్లో మూగ జీవాలకు మండల పశు వైద్యశాఖ అధికారి సౌజన్య దేవి ఆధ్వర్యంలో సోమవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మేకలు, గొర్రెలు, పశువులను ముక్కు చీముడు, నోటి పుల్లు ఇతర వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు చర్యలో భాగంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రెండు పంచాయితీలలోని వివిధ గ్రామాలలో సుమారు 161 మూగజీవాలకు వ్యాక్సిన్ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల వెటర్నరి అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను ప్రభావంతో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: జిల్లాలో తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని రకాల విద్యా సంస్థలకు సెలవులు పొడిగించిన నేపథ్యంలో అంగన్వాడి కేంద్రాలకు వర్తించేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కుర్ర శంకర్రావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. గత పది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు శిథిలావస్థకు చేరిన అంగన్వాడి కేంద్రాలకు ముప్పు పొంచి వుందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సెలవులను అంగన్వాడీలకు వర్తించే విధంగా ప్రకటన జారీ చేయాలని కోరారు.

తగు జాగ్రత్తలతో విద్యుత్ ప్రమాదాల నివారణ

వినియోగదారులకు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మహేంద్రనాథ్ సూచన

ప్రజాశక్తి- సీతమ్మధార : భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రమాదాలను నివారిద్దామని విద్యుత్ వినియోగదారులకు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎల్ మహేంద్రనాథ్ పిలుపునిచ్చారు. భారీ వర్షాలు, గాలులు ఉన్నపుడు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్ సమయంలో గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్‌మోడ్‌లోనే, కరెంటు బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంబాలు, స్టే వైర్లను ముట్టుకొనరాదని, ఇంటి పరిసరాలలో చెట్లు, కరెంటు పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గాలి వాన సమయంలో కరెంటు లైన్ కింద ఉండరాదని సూచించారు. మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునిగినా, పూర్తిగా తడిసినా షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు.. ఇళ్లు, భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులు తమ భవనాల అంతర్గత వైరింగ్‌కు నాణ్యత కలిగిన విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, పరికరాల్ని వాడడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఇళ్లలోని స్విచ్ బోర్డులను పిల్లలకు అందనంత ఎత్తులో అమర్చుకోవాలని, తప్పనిసరిగా ఎర్త్ పైప్ ద్వారా ఎర్తింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాల్ని అరికట్టవచ్చన్నారు.. డాబాలపైన దుస్తులు ఆరవేసేటప్పుడు, ఇళ్ల నిర్మాణ ప్రాంతాల్లో సమీపాన విద్యుత్ వైర్లు ఉంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912 కు తెలియజేయాలన్నారు.

ఉపాధి వేతన బకాయిల కోసం ఎదురుచూస్తున్న గిరిజన కూలీలు

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-సీలేరు : జాతీయ గ్రామీణ హామీ ఉపాధి పథకం కింద చేసిన పనులకు బకాయి పడ్డ ఆరు వారాల కూలి డబ్బులు తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని జీకే వీధి మండలం అమ్మోరు దారకొండ గిరిజన కూలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కూలీలు విలేకర్లతో మాట్లాడుతూ తమకు ఆరు వారాలకు సంబంధించిన వేతనాలు బకాయి ఉందన్నారు. పనులు చేసిన మూడు రోజుల్లో బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని అధికారులు చెప్పారని, కాని నేటికీ జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది వర్షాభావ పరిస్థితి కారణంగా పంటలు పండక కుటుంబ పోషణ కష్టమవుతుందని, ఆర్థికంగా సతమాతమవుతున్నామని వాపోయారు. తమ దగ్గర చిల్లిగవ్వ లేదని, మా కుటుంబాల జీవనం ఎలా కొనసాగించాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఉపాధి హామీ పనులకు సంబంధించి బకాయి ఉన్న కూలి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

జిసిసి అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా అందని రేషన్

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని తెల్ల రేషన్ కార్డుదారులకు జిసిసి అధికారులు నిర్లక్ష్యం కారణంగా జులై నెల పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు అందజేయలేదని సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ దుర్జో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు పంచాయతీ పరిధిలో 1002 తెల్ల రేషన్ కార్డులు ఉండగా 666 మందికి మాత్రమే జులై నెల రేషన్ సరుకులు సీలేరు జిసిసి నుంచి అందించారని తెలిపారు. ఇంకా 336 మందికి ఉచిత బియ్యం పంపిణీ చేయలేదన్నారు. 2023 జులై నుంచి ఈ ఏడాది జులై వరకు జిసిసి నుంచి రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. ఎందుకు బియ్యం సక్రమంగా పంపిణీ జరగలేదని సీలేరు సేల్స్‌మ్యాన్ నారాయణను, ఎండియు ఆపరేటర్‌ను అడిగితే ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. జూన్, జులైలో తెల్లరేషన్ కార్డుదారులకు పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ చేయకపోవడంపై అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తునట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు ఇవ్వవలసిన 336 కార్డులకు, ఆగస్టు నెల నుంచి 1002 తెల్ల రేషన్ కార్డులు పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు అందేలా జిసిసి అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వరద బాధితులకు బరకాలు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలం కుమ్మూరు గ్రామంలో వరద బాధితులకు సోమవారం విఆర్ఓ, గ్రామ సర్పంచ్, తెలుగుదేశం, జనసేన నాయకులు బరకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుర్సం సుబ్బారావు, అనిగి చంద్రయ్య, కర్సం ప్రసాద్, మిడియం నగేష్, రాజ్ కుమార్, మిడియం బుల్లమ్మ, యువత పాల్గొన్నారు.

శరభన్నపాలెం యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామానికి చెందిన రీమల జయవర్ధన్ (22) అనే యువకుడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయవర్ధన్ గురువారం విశాఖ నుంచి శరభన్నపాలెం బయలుదేరాడు. అయితే మధ్యలో పెదమాకవరం వాగుపై వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జయవర్ధన్ అక్కడే ఆగిపోయాడు. కాని అప్పటి నుండి జయవర్ధన్ ఆచూకీ లేదు.

తాగునీటి కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలను పరిష్కరించే ధ్యేయంతో నిరంతరం పనిచేస్తున్నానని 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు తెలిపారు. వార్డులోని భీమనగర్ శ్రీ దుర్గా దేవి ఆలయంలో మంచి నీటి కుళాయిని సోమవారం ఆయన ప్రారంభించారు.

అంబులెన్స్ లేక బైక్‌పై మృతదేహం తరలింపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఓ మహిళ మృతదేహాన్ని ఐదు కిలోమీటర్లు మేర ద్విచక్ర వాహనంపై తరలించిన సంఘటన సోమవారం మండలంలోని జడ్డంగి పీహెచ్సీ పరిధిలో చోటుచేసుకుంది. జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిరియాలవీధి గ్రామానికి చెందిన కుంజం అన్నపూర్ణ (60) అనారోగ్యంతో బాధపడుతుండగా, వైద్య సేవలు నిమిత్తం వారి బంధువులు సోమవారం జడ్డంగి పిహెచ్‌సికి తీసుకొచ్చారు. అక్కడ పరిస్థితి విషమించి అన్నపూర్ణ మృతి చెందారు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న ఆమె కుమారుడు విధి నిర్వహణలో బెంగళూరు వెళ్ళాడు. జడ్డంగి పిహెచ్‌సి అంబులెన్సు రిపేరులో ఉండడంతో ఆసుపత్రి నుండి అన్నపూర్ణ మృతదేహాన్ని ఇంటికి చేర్చడానికి ఎటువంటి సదుపాయాలు లేకపోయింది. విషయం తెలుసుకున్న జడ్డంగి లారీ ఓనర్స్ యూనియన్ నాయకుడు గణజాల మల్లికార్జున్ అంబులెన్స్ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అతని ద్విచక్ర వాహనం మీద కుంజం అన్నపూర్ణ మృతదేహాన్ని 5కిలోమీటర్లలో వున్న వారి స్వగ్రామం మిరియాలవీధి తరలించారు. జడ్డంగి పిహెచ్సి పరిధిలో సుమారు 30 గిరిజన గ్రామాలు ఉన్నాయి. అంబులెన్స్ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏజెన్సీలోని ఆసుపత్రుల్లో అంబులెన్స్, వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులోకి తేవాలని టిడిపి నాయకులు గణజాల తాతారావ్ విజ్ఞప్తి చేశారు.

బైకుపై కుంజం అన్నపూర్ణ మృతదేహాన్ని తరలిస్తున్న యువకులు

కాలువలు, వాగులు వద్ద హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి
తుఫాన్ కారంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాలువలు, వాగులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రమాదం జరిగే ఆస్కారం ఉండటంతో రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఆయా వాగులు, కాలువలు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, భద్రత చర్యలు చేపట్టారు. మారేడుమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు తన సిబ్బందితో కలిసి సున్నంపాడు గ్రామ సమీపంలో ఉద్రిక్తంగా ప్రవహిస్తున్న నూరుపూడి కొండవాగును సోమవారం పరిశీలించారు. వరదలు తగ్గేవరకు వాగులు ఎవరూ దాటవద్దని పలు సూచనలు చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వాగులు దాటకుండా డ్రమ్ములు ఏర్పాటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి
కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పొంగి ప్రవహిస్తున్న వాగులు వద్ద జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ ఎస్ వెంకయ్య ఆధ్వర్యంలో ప్రజలు వాగులు డ్రమ్ములు ఏర్పాటు చేసి, నోఎంట్రీ రిబ్బన్స్ అతికించారు. ప్రజలు ఎవరూ పొంగి ప్రవహిస్తున్న వాగులు మీదగా వెళ్లవద్దని హితవుపలికారు. మండల పరిధిలో ఎక్కడైనా రహదారులపై అడ్డంగా చెట్లు పడిన, వాగులు తెగినా పోలీసులకు తెలియజేయాలని కోరారు.

సాంఘిక సంక్షేమ శాఖ స్థల రక్షణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సాంఘిక సంక్షేమ శాఖ భూమి కబ్జాకు కుట్ర చేస్తున్న ముత్తా బత్తుల రత్నకుమార్‌పై తక్షణమే కేసు నమోదు చేసి, ప్రభుత్వ ఆస్తికి రక్షణ కల్పించాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు కలెక్టర్‌ను కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిరిపురం టైకూన్ జంక్షన్‌లో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 3500 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు చూస్తున్నారన్నారు.

28 నుంచి ఆల్ ఇండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఈనెల 28 నుండి ఆల్ ఇండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆర్.జానకి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న సాంప్రదాయ నృత్య కళాకారుల ప్రతిభనుమరింత ప్రోత్సహించే ఉద్దేశ్యంతో దేశభక్తి అంశంతో కూడిన బృంద నృత్యాలతో పాటు జానపద, శాస్త్రీయ నృత్యాంశాల్లో డ్యూయెట్, గ్రూప్ విభాగాల్లో ఈ పోటీలనునిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు 8522990123 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యా ఇన్‌స్పైర్ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఇన్‌స్పైర్ అవార్డ్స్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని తన సమావేశ మందిరంలో ఆయనను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ కలిసి ఈ కార్యక్రమాన్ని గురించి వివరించారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలకు విజ్ఞానాన్ని పెంపొందించి, సామాజిక బాధ్యత, సైన్స్ టెక్నాలజీ ఆవశ్యకతపై అవగాహన కలిగించడానికి ఈ ఇన్‌స్పైర్ అవార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ అవార్డుల దరఖాస్తులకు ఈ ఏడాది సెప్టెంబర్ 15వ తేదీ ఆఖరు రోజు అని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ డి.హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశ ప్రజల వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జికె.వీధి మండలం సీలేరు వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, ఖాదర్ మస్తాన్ వల్లి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పది రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో 100శాతం దోమలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ఇంటి పరిసరాలు, మురుగుకాలువలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందితే డయేరియా, పచ్చకామెర్లు, చికెన్ గున్యా, ఫైలేరియా, మలేరియా, టైఫాయిడ్, డెంగు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. ప్రస్తుతం లెప్పర్సి సర్వే జరుగుతుందని అందరూ దీనికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నిలిచిన సీలేరు, భద్రాచలం బస్సులు

ప్రజాశక్తి-సీలేరు : ఏజెన్సీలో వారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లంబసింగ్ నుంచి సీలేరు వరకు ఘాట్ రోడ్డులో చెట్లు కూలిపోవడం, భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి అధికంగా ఉన్న నేపథ్యంలో అల్లూరి జిల్లా దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు విశాఖపట్నం నుండి నర్సీపట్నం, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే బస్ సర్వీసులను నిలుపుదల చేశారు. ఇప్పటికే నైట్ సర్వీసు బస్సులను నిలిపి వేసిన ఆర్టీసీ అధికారులు, సోమవారం పగలు నడిచే విశాఖ భద్రాచలం బస్సును రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం లంబసింగ్ ఘాట్ రోడ్లో భారీ వృక్షం రహదారికు అడ్డంగా కూలిపోవడంతో అనకాపల్లి -సీలేరు బస్సు సర్వీస్ సీలేరుకు ఆలస్యంగా 2 గంటలకు చేరుకుంది. ఘాట్ రోడ్‌లో గంటలు తరబడి బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు గురయ్యారు.

ఇందుకూరుపేటలో మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

రైతులకు జీడిమామిడి మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి కొత్త కాలనీలోని గిరిజన రైతులకు సోమవారం జీడిమామిడి మొక్కలను ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పిటిసి సభ్యుడు గొర్రె బాలాజీ బాబు, సర్పంచ్ కొండ జాకబ్, ఎంపిడిఒ వీర కిశోర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చెట్ల కింద నిలబడటం, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవడం వంటివి చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి శ్రీనివాసరావు, ఏపీవో రెడ్డి బాబు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేట స్త్రీ శక్తి భవనం వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన రైతులకు జీడి మామిడి మొక్కలను టిడిపి మండల అధ్యక్షులు మరిచెట్ల బుజ్జిబాబు, ఏపీఓ లక్ష్మీనారాయణ, శరభవరం ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర, దేవారం సర్పంచ్ తుర్రం రమాదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న జీడిమామిడి మొక్కలను గిరిజనులు శ్రద్ధతో పెంచి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. దేవీపట్నం మండలంలో 157 ఎకరాలకు 135 రైతులకు ఎకరానికి 70 మొక్కలు చొప్పున సుమారు 10,500 మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంవి సువర్ణ రాజు, టిడిపి నాయకులు గోళ్ళ చంటిబాబు, చవళం శివరామకృష్ణ, ముంద్రు మధుసూదన్ రావు, కేశవరపు చంద్రకుమార్, జనసేన నాయకులు కె.వీరబాబు, రేలంగి రాంబాబు, పల్లపాటి నాగేశ్వరరావు, పుట్టపల్లి మల్లేష్, గనిశెట్టి వీరబాబు, తంటిపురెడ్డి వీరబాబు, జేఈ వీర్రాజు సాంకేతిక సహాయకులు చిన్న అప్పన్న దొర, గంగరాజు, వెంకటరెడ్డి క్షేత్ర సహాయకులు లక్ష్మి, రాము, శివ, బాలు పాల్గొన్నారు.